క్లుప్తంగా

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న అడ్లూరి బంధువులు

ధర్మపురి: కాంగ్రెస్ అంసెబ్లీ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శనివారం రాత్రి కొందరు కులం పేరుతో దూషించారని ఆదివారం ధర్మపురి పోలీస్ స్టేషన్లో ఆయన బంధువులు ఫిర్యాదు చేశారు. ధర్మపురిలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్‌హాల్‌లోని గోదావరి రెసిడెన్సీలో శనివారం రాత్రి కొందరు చొరబడి కులం పేరుతో దూషించడమే కాకుండా చంపేస్తామని బెదించారని వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలనిపోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



పెగడపల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

పెగడపల్లి:మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కేక్‌కట్ చేశారు. దేశ ప్రధానిగా ప్రజా సంక్షేమం కోసం ఆమె అమలు చేసిన పథకాలు, అందించిన సేవలను కొనియాడారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాములుగౌడ్, బతికపల్లి సర్పంచి శంకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: ఇందిరాగాంధీ జయంతి వేడుకలను పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రధానిగా ఆమె దేశానికి అందించిన సేవలను నాయకులు కొనియాడారు.

నిరుపేదలకు సత్యసాయి సేవాసమితి చేయూత



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవాసమితి సభ్యులు

జగిత్యాలటౌన్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతిని పురస్కరించుకుని నిరుపేదలకు సత్యసాయి సేవా సమితి చేయూతనిచ్చింది. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జగిత్యాల సత్యసాయి సేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు, పులిహోరాతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. ఈనెల 23న సత్యసాయిబాబా 98వ జయంతి సందర్భంగా ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ తెలిపారు. మొదటి రోజు ఆదివారం 150 చెద్దర్లు పంపిణీ చేశామని రాత్రి పూట రోడ్ల పక్కన నిద్రించే నిరాశ్రయులకు బ్లాంకెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. రెండవ రోజు రుద్రాభిషేకం, 3వ రోజు గోశాలలలో గోసేవ, హనుమాన్ చాలీసా పఠనం, వృద్ధాశ్రమ సేవ, 4వ రోజు నిరాశ్రయులకు బ్రెడ్లు, అరటిపండ్లు పంపిణీ, 5వ రోజు బాబా జయంతిన టవర్ వద్ద అల్పాహార పంపిణీ, బీద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, సాముహిక సత్యనారాయణ వ్రతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ కన్వీనర్ చిటుమల్ల లక్ష్మీనారాయణ, కోటగిరి మహేందర్, ఎర్ర సత్తయ్య, గుండా రాజశేఖర్, తాటిపర్తి దశరథరెడ్డి, మహిళా విభాగం సభ్యులు చిటుమల్ల జయశ్రీ, బొడ్ల వసంత, బట్టు పద్మ, సామ రజిత తదితరులు పాల్గొన్నారు.

మండలంలో నేడు ఆది శ్రీనివాస్ పర్యటన

కథలాపూర్: మండలంలోని దుంపేట,దూలూర్, బొమ్మెన, తక్కళ్లపెల్లి గ్రామాల్లో సోమవారం వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ పర్యటిస్తారని పార్టీ మండలాధ్యక్షుడు నాగరాజు తెలిపారు. అయా గ్రామాల పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు దీపోత్సవం

రాయికల్: పట్టణంలోని గుడికోటలో సోమవారం రాత్రి 7 గంటలకు ఇస్కాన్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు గుడికోట ఆలయ కమిటీ సభ్యులు తుమ్మల సదాశివరెడ్డి,మ్యాకల రమేశ్ ఆదివారం తెలిపారు.

కొనుగోలు కేంద్రాలకు స్థల సమస్య

- పొలాలు కోతకు వచ్చినా కోయించలేక రైతులు సతమతం
- పొలాల్లో ఆరబెడితే రైతులకు రెట్టింపు ఖర్చు



ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలిస్తున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: గ్రామాల్లో పొలాలు కోతకు వచ్చినప్పటికీ, రైతులు సకాలంలో కోయించలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలన్నీ నిండిపోయాయి. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలకు సరైన స్థలాలు లేకపోవడం, ప్రతి సీజన్‌లో అద్దె ప్రతిపాదికన స్థలాలు లీజుకు తీసుకుంటుండటం వంటి సమస్యలు ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందిగా మారాయి.

జిల్లాలో 398 కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో ధాన్యం సేకరణకు 398 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో మహిళా సంఘాలు 127 కేంద్రాలు నిర్వహిస్తుండగా, ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో 271 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో 50 లోపు కొనుగోలు కేంద్రాలకే అక్కడక్కడ అనువైన స్థలాలు ఉన్నాయి. మిగతా కొనుగోలు కేంద్రాలకు సరైన స్థలాలు లేవు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో గ్రామాల్లోని గుట్ట బోర్లను లెవలింగ్ చేసుకుని ధాన్యం పోస్తుండగా, మరికొన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎస్సారెస్పీ కాల్వ తవ్వినప్పుడు, పోసిన మట్టిని తీసివేసి ధాన్యం పోసుకుంటున్నారు. ఇవి సైతం లేని గ్రామాల్లో ప్రైవేట్ స్థలాలను లీజుకు తీసుకుని కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీంతో, స్థల యజమానులు ప్రతి సీజన్‌లో లీజు ధరలు పెంచుతున్నారు. ఇక, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు లక్షల్లో కమీషన్ వచ్చినప్పటికీ, కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం పోసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదు.

తడిసి మోపడవుతున్న ఖర్చులు

కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పెద్దగా పట్టించుకోకపోవడంతో, రైతులే ధాన్యం పోసే భూమిని చదును చేసుకుంటున్నారు. అంతేకాకుండా, ధాన్యం మట్టిలో కలిసి పోతుందనే ఉద్దేశ్యంతో, ధాన్యం పోసేందుకు కవర్లను అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఒక్కో కవర్‌కు రోజుకు 50–80 వరకు అద్దె వసూలు చేస్తున్నారు. కొనుగోళ్లు సాఫీగా సాగకపోవడంతో, ధాన్యం తూకం అయ్యే వరకు కనీసం 15–20 రోజులు పడుతుంది. దీంతో, ధాన్యం కింద వేసిన కవర్ల ఖర్చే రైతులకు తడిసి మోపడవుతోంది.

కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబెడుతున్న రైతులు

రైతులు ధాన్యం పొలాల్లో ఆరబెట్టి తిరిగి కొనుగోలు కేంద్రాలకు తీసుకరావడానికి రెట్టింపు ఖర్చుతో పాటు కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో, రైతులు హార్వేస్టర్‌తో పొలం కోయించి, ట్రాక్టర్‌లో కొనుగోలు కేంద్రానికి తీసుకవస్తున్నారు. వానాకాలం సీజన్‌లో పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటంతో, తేమ శాతం 17 లోపు రావడానికి కనీసం వారం రోజులు ధాన్యాన్ని ఆరబెట్టాల్సి వస్తుంది. కొనుగోలు కేంద్రంలోనే ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అధిక స్థలం అవసరం ఉండటంతో, ఇతర రైతులు ధాన్యం పోయలేని పరిస్థితి ఏర్పడింది.

కోతకు వచ్చిన కోయించలేని పరిస్థితి

జిల్లాలో వరి పొలాలు దాదాపు 90 శాతం కోతకు వచ్చాయి. అయితే, వరి పొలం కోయించిన తర్వాత ధాన్యం ఎక్కడ పోసుండన్న పరిస్థితి రైతులకు అర్థం కావడం లేదు. అప్పటికే కొనుగోలు కేంద్రాలన్ని నిండి ఉండటం, ఇంకా కొనుగోళ్లు పూర్తి స్థాయిలో ప్రారంభం కాకపోవడంతో, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తరలించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ధాన్యం పొలాల్లో ఆరబెట్టి, పొలంలో కుప్పగా పోసిన ధాన్యాన్ని తిరిగి ట్రాక్టర్ డబ్బాలో పోయడానికి రెట్టింపు ఖర్చుతో పాటు రైతులకు శ్రమతో కూడిన వ్యవహారంగా మారింది.

స్థలాలు సరిపోవడం లేదు



చాలా చోట్ల కొనుగోలు కేంద్రాలకు స్థలాలు సరిపోవడం లేదు. నలుగురైదుగురు రైతులు ధాన్యం పోయగానే నిండిపోతున్నాయి. స్థలం లేక పొలం కోయించడం ఆపాను. పొలాల్లో ధాన్యాన్ని ఆరబెట్టే పరిస్థితి లేదు. కాబట్టి పొలం కోయగానే కొనుగోలు కేంద్రానికి తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఏలేటి జలేందర్ రెడ్డి, ఇటిక్యాల, రాయికల్

పొలాల్లో ఆరబెట్టి తీసుకురావాలి



రైతులు హార్వెస్టర్‌తో కోయించి నేరుగా కొనుగోలు కేంద్రానికి తరలించి, అక్కడే నేర్పుతున్నారు. దీంతో రైతులకు ఇబ్బంది కలుగుతుంది. కాబట్టి రైతులు నేరుగా పొలాల్లో ఆరబెట్టి, కొనుగోలు కేంద్రానికి తీసుకవస్తే, త్వరగా తూకం జరుగుతుంది. రైతులు నిబంధనలు పాటించాలి.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, జగిత్యాల

మీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా



కోరుట్లలో రోడ్ షోలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల రూరల్: స్థానికుడిగా తనకు ఎమ్మెల్యేగా అవకాశమిస్తే ఎల్లవేళలా అందుబాటులో ఉండి మీ కష్ట, సుఖాల్లో పాలుపంచుకుంటానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ అన్నారు.మండలంలోని యూసుఫ్‌నగర్, తిమ్మయపల్లె, కిషన్‌రావుపల్లె, ధర్మారం, నాగులపేట, సంగెం, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో ఆదివారం డాక్టర్ సంజయ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన తండ్రి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని, తాను గెలిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేయిస్తానని పేర్కొన్నారు. బీజేపీ,కాంగ్రెస్ అభ్యర్థులు స్థానికులు కాదని, నేను మీ బిడ్డనని, ఎప్పుడూ మీ వద్దనే ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో చీటి వెంకట్రావు, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీపీ తోట నారాయణ, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, వైస్ ఎంపీపీ చీటి స్వరూపా రాణి,సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

కోరుట్ల: పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్ నాయకుడు ఎడ్ల రమేశ్ ముదిరాజ్, బీజేపీ నాయకుడు మిట్టపెల్లి రాజ శేఖర్ బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీఆర్‌ఎస్‌తోనే సుస్థిరపాలన

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు బీఆర్‌ఎస్‌తోనే సుస్థిర పాలన అందుతుందని ఎమ్మెల్యే కుమార్తె మాధవరం సమత అన్నారు. ఆదివారం మల్లాపూర్‌లో తన సోదరుడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కి మద్దతుగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. సంజయ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్‌ఎంపీపీ గౌరు నాగేష్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుమార్తె సమత

అభివృద్ధి,సంక్షేమం చూసి ఓటు వేయండి

మెట్‌పల్లిరూరల్: అభివృద్ధి,సంక్షేమం చూసి ప్రజలు ఓటు వేయాలని కోరుట్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ సోదరి సమత అన్నారు.మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలి

మెట్‌పల్లి: అభివృద్ధి కోసం ప్రజలు బీఆర్‌ఎస్ అండగా ఉండాలని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సతీమణి సరోజ కోరారు. పట్టణంలోని 7 వార్డులో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పురుషోత్తం, మన్నేఖాన్, ఎనగందుల వనజలతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

అభివృద్ధి కన్నా.. సమస్యలు మిన్న..

- పెగడపల్లి మండలంలో పలు సమస్యలు
- అధ్వానంగా అంతర్గత రహదారులు
- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- శిథిలావస్థలో పీహెచ్‌సీ భవనం
- సొంత భవనం లేని మెజార్టీ అంగన్‌వాడీ



నిరుపయోగంగా ఉప్పపల్లె పాఠశాల భవనం

పెగడపల్లి: మండలంలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి పనులు జరిగి ప్రజా సౌకర్యాలు మెరుగుపడ్డాయి. అయినా మండలంలో మరిన్ని సమస్యలు వెంటాడుతునే ఉన్నాయి. గ్రామాల్లోని ప్రధాన రహదారులన్నీ సీసీరోడ్లుగా మారినా అంతర్గత రహదారులు మెరుగు పడాల్సి ఉంది. గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న అనుబంధ గ్రామాల అభివృద్ధిపై సర్పంచులు, నాయకులు దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలున్నాయి. ఉప్పుపల్లె, నామాపూర్, గొల్లపల్లె, సుద్దపల్లి, అయ్యవారిపల్లె, రాజారాంపల్లి తాండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడ్డాయి. దీంతో ఆయా పాఠశాలల భవనాలు నిరుపయోగంగా మారాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పాఠశాలల భవనాలు అధ్వానంగా మారాయి. వృథాగా ఉంటున్న భవనాలను గ్రామాల్లో ఇతర అవసరాలకు వినియోగించాలని గ్రామస్తులు అధికారులకు సూచిస్తున్నారు. పంట పొలాల వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలు రైతులను భయాందోళనకు గురిచేస్తున్నాయి.

వ్యవసాయ మార్కెట్ ఉన్నా.. కొనుగోళ్లు సున్నా..

మండలంలోని 23 గ్రామాలను 21 గ్రామాలు ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంత పరిధిలో ఉన్నాయి. చిన్న నీటి వనరుల్లో నీటి లభ్యత ఎక్కువగా ఉండటంతో అధిక శాతం వరి పంటనే సాగు చేస్తారు. రైతులు పండించిన వరి ధాన్యం విక్రయించి సొమ్ము చేసుకోవాలంటే ధాన్యం కొనుగోలు కేంద్రాలు తప్పా.. ఇతర సౌకర్యాలు లేవు. స్థానికంగా వ్యవసాయ మార్కెట్ ఉన్నా మార్కెట్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు సాగడం లేదు. కేవలం పాలకవర్గం నియామకానికే మార్కెట్ పరిమితమైంది. మండలంలోని బతికపల్లిలో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన హోమియో వైద్యశాలకు పక్కా భవనం లేక శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనంలో కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలో 35 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలకు పక్కా భవనాల నిర్మాణం జరుగలేదు. దీంతో వసతులు లేక వసతి గృహాల్లో విద్యార్థులు చేరడం లేదు. మండలంలో ఆరు ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 500 పదో తరగతి విద్యార్థులకు ఇంటర్ చదువుకునేందుకు స్థానికంగా జూనియర్ కళాశాల లేక చాలామంది చదువులకు దూరప్రాంతాలకు వెళ్తున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా పైపులైన్ విస్తరించినా ఏ ఒక్క గ్రామానికి సైతం చక్కగా నీరు సరఫరా కావడం లేదు. నేటికి ఆయా గ్రామాల్లో ఉన్నా మంచినీటి పథకాల నుంచి గ్రామ పంచాయతీల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆసుపత్రి స్థాయిని పెంచాలని ప్రజలు కోరుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నామని సిబ్బంది చెబుతున్న రాత్రి వేళల్లో వైద్యులు అందుబాటులో లేని కారణంగా అత్యవసర వైద్య సేవలకు జగిత్యాల, కరీంనగర్ వెళ్లాల్సి వస్తోంది. మండలంలో 10 వేల మంది మహిళా సంఘాల సభ్యులున్నారు. కానీ వారు సమావేశాల నిర్వహణకు సొంత భవనాలు లేవు. మండలంలోని 52 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 16 కేంద్రాలకు సొంత భవనాలుండగా 25 కేంద్రాలు అద్దె ఇళ్లలో, 11 కేంద్రాలు పాఠశాల భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతు లేక శిథిలావస్థకు చేరాయి. దీంతో వాటిలో కేంద్రాలు నిర్వహించేందుకు సిబ్బంది జంకుతున్నారు. మండల విద్యాధికారి, వ్యవసాయాధికారి, పశువైద్యాధికారులు లేక ఇతర మండలాల అధికారులు ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇన్‌చార్జీ అధికారుల సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.



శిథిలావస్థలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రంలో కొనసాగుతున్న హోమియో ఆసుపత్రి

సొంత భవనం నిర్మించాలి



ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన హోమియో ఆస్పత్రికి సొంత భవనం లేదు. ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనంలో నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు హోమియో ఆస్పత్రికి రోగుల ఆదరణ ఉండేది. అధికారుల పట్టింపులేని కారణంగా సక్రమంగా వైద్య సేవలు అందక రోగుల సంఖ్య తగ్గింది. ఇంకా మండలంలో నెలకొన్న సమస్యలు తీర్చాలి.

– తాటిపర్తి రాజేందర్‌రెడ్డి, బతికపల్లి

జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో జూనియర్ కళాశాల లేక పోవడంతో ఇంటర్ చదువులకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. విద్య కోసం ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. పెగడపల్లిలో కాలేజీ ఏర్పాటు చేయడం కోసం నాయకులు కృషి చేయాలి.

– ఎన్‌రెడ్డి మహేశ్, పెగడపల్లి

అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు జారీ



మంగేళలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్/రాయికల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను ప్రారంభిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క తెల్లరేషన్ కార్డు జారీ చేయలేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ధాన్యంపై ప్రతి క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని కుమ్మరిపల్లి, ఉప్పుమడుగు, అయోధ్య, రాజనగరం, ఆలూరు, వీరాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ రమేశ్, జెడ్పీటీసీ పద్మ, విండో చైర్మన్ నవీన్‌రావు, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



తాండ్ర్యాలలో ప్రచారం చేస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల,దుంపేట గ్రామాల్లో వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ఇంటింటా పంపిణీ చేసి ప్రజలకు పార్టీ అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, ఎస్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు ఆకుల సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

చిత్ర కథ: వంతెనపై పేరుకుపోయిన ఇసుక దిబ్బ



కథలాపూర్: కథలాపూర్- భూషణరావుపేట రోడ్డులో కథలాపూర్ శివారులో ఎస్సారెస్పీ వరద కాలువ వంతెన వద్ద ఇసుక పేరుకుపోయి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రోడ్డు గుండా ప్రతీరోజు ఐదు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఇసుకలో బైకుల టైర్లు ఇరుక్కుపోయి అదుపు తప్పి పడిపోతున్నారు. ఆటోల టైర్లు ఇసుక వద్ద అదుపు తప్పడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులు చొరవ చూపి వంతెనపై పేరుకుపోయిన ఇసుకను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతువేదికకు దారేది?



రైతు వేదిక ఎదుట ధాన్యం ఆరబెట్టిన రైతులు

మల్లాపూర్: రహదారులపై రైతులు ధాన్యం ఆరబెడుతుండడంతో దారి లేకుండా పోతుంది. కల్లాల నిర్మాణానికి ప్రభుత్వాలు నిధులు వెచ్చిస్తున్నా రైతులు ఆసక్తి చూపడం లేదు. చాలా ప్రాంతాల్లో నిత్యం రవాణా ఉండే రహదారుల పైనే ధాన్యం ఆరబెడుతున్నారు. మల్లాపూర్ మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్ వద్ద రైతువేదిక ఆవరణ వద్దే కొంతమంది రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడంతో ఆ రైతువేదికకు వేళ్లేందుకు దారి లేకుండా పోయింది. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు రైతువేదిక వద్ద ఆరబెట్టిన ధాన్యాన్ని తొలగింపచేయాలని స్థానికులు కోరుతున్నారు.